
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



సోమశిలలో 71.903 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 71.903 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 3,240 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1550, ఉత్తర కాలువకు 650, కండలేరుకు 1200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,125
3 శాతం జీఎస్టీతో	రూ.7,339
నవర (8 గ్రా)	రూ.58,504


వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.6 /23.4

జిల్లాలో శుక్రవారం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. గురువారం గాలిలో తేమ 93 శాతం ఉంది.

గుండె గుబిల్లు

కరెంట్ చార్జీల సర్దుపోటు



జిల్లాలో కరెంట్ బిల్లులు చూస్తే.. వినియోగదారుల గుండెలు గుభేలు మంటున్నాయి. ప్రజల నుంచి వాస్తవంగా వసూలు చేసే ట్రూ అప్ చార్జీల మొత్తానికి విద్యుత్ శాఖాధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. తొలి విడత ట్రూఅప్ కింద విద్యుత్ చార్జీల పెంపు నవంబర్ నుంచే ప్రారంభం కావడంతో డిసెంబర్ బిల్లుల్లో చార్జీల మోత మోగుతున్నాయి. రెండో విడత కూడా ఈ నెల నుంచే ప్రారంభం కావడంతో వచ్చే నెలలో బిల్లులు ఏ స్థాయిలో వస్తాయో అని ప్రజలు ఇప్పటి నుంచే బెంబేలు ఎత్తుతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, చార్జీల భారాన్ని తగ్గిస్తామంటూ కోతలు కోసిన చంద్రబాబు.. ఐదు నెలలు తిరగక ముందే తన అసలు రూపాన్ని బయట పెట్టుకున్నారు. తాజాగా డిసెంబర్ నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇచ్చే ఉచిత కరెంట్ విధానానికి మంగళం పాడేశారు.

- ఉమ్మడి జిల్లాలో నెలకు 320 కోట్ల యూనిట్ల వినియోగం
- ట్రూఅప్ కింద యూనిట్‌పై రూ.1.50 చొప్పున పెరుగుదల
- పదిహేను నెలల పాటు వసూలు
- ఈ లెక్కన నెలకు రూ.450 కోట్ల బాదుడు?
- నెల్లూరు జిల్లాలోనే రూ.6,750 కోట్లు
- అయితే విద్యుత్ శాఖాధికారులు మాత్రం రూ.8 కోట్లే అని కాకి లెక్కలు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్‌కు మంగళం
- వీరి నుంచి బలవంతంగా సోలార్ సౌకర్యానికి దరఖాస్తుల స్వీకరణ
- 11 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు షాక్
- విద్యుత్ చార్జీల పెంపుపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో డిసెంబర్ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులు చూసిన వినియోగదారులు గుండెలు బాదుకుంటున్నారు. సామాన్యులకు కరెంట్ చార్జీల సర్దు'పోటు'.. గుండెపోటు తెప్పించే విధంగా ఉన్నాయి. యూనిట్ వినియోగంపై రూ.1.50 వంతున పెరిగింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా విద్యుత్ రంగంలో చేసిన అక్రమాల కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలపై పెనుభారం పడింది. దీనికి సంబంధించి అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రతిపాదనల మేరకు వినియోగదారులపై పెనుభారం పడకుండా, విద్యుత్ సంస్థలు పునర్జీవం సాధించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఆ బిల్లులే అధికమంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు, కూటమి నేతలు గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, అవసరం అయితే 30 శాతం మేర తగ్గిస్తామని హామీ ఇచ్చింది. కూటమి నేతల హామీలు నమ్మి గెలిపించిన ప్రజలకు అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే చుక్కలు చూపిస్తూ విద్యుత్ చార్జీల భారాన్ని మోపింది. విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ పేరుతో వినియోగదారులపై చార్జీల మోత మోగిస్తోంది.

నెలకు రూ.450 కోట్ల భారం నిజమేనా?

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 12,81,761 విద్యుత్ సర్వీసు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 2,00,448 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించి ట్రూఅప్ చార్జీలు మినహాయింపు ఉంది. మిగిలిన 10,81,313 సర్వీసులకు ట్రూఅప్ చార్జీల భారం పడుతోంది. జిల్లాలో అన్ని కేటగిరీల కనెక్షన్లకు సంబంధించి నెలకు 320 కోట్ల యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని ఆ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. విద్యుత్ అధికారులు చెప్పిన లెక్కన ప్రకారం చూస్తే.. యూనిట్‌పై రూ.1.50 పెరుగుతుంది. మొత్తం వినియోగంలో వ్యవసాయానికి 20 కోట్ల యూనిట్లు మినహాయించినా.. సగటున 300 కోట్ల యూనిట్లపై నెలకు దాదాపు రూ.450 కోట్ల భారం పడుతుందని అంచనా. ట్రూఅప్ చార్జీలను 15 నెలల పాటు వసూలు చేస్తారని విద్యుత్‌శాఖాధికారులు చెబుతున్నారు. ఒక నెల్లూరు ఉమ్మడి జిల్లా పరిధిలోనే రూ.6,750 కోట్ల భారం పడుతుందని లెక్కలు చెబుతున్నాయి. అయితే విద్యుత్‌శాఖాధికారులు చెప్పే లెక్కలకు, వాస్తవానికి పొంతన లేకుండా ఉన్నాయి. నెలకు కేవలం రూ.8 కోట్ల భారం పడుతుందని చెబుతున్నారు. కాగా రెండో విడతలో కూడా ఇదే స్థాయిలో చార్జీల మోత మోగుతుందని అధికారులు చెబుతున్నారు. దీన్ని బట్టి రెండింతలు భారం పడే అవకాశం ఉందని అంచనా.

జిల్లాలో సర్వీసులు ఇలా..

కేటగిరీ-1 (గృహ సర్వీసులు)	9,42,905
కేటగిరీ-2 (దుకాణాల సర్వీసులు)	1,07,800
కేటగిరీ-3 (పరిశ్రమలు)	4,172
కేటగిరీ-4 (స్ట్రీట్ లైట్లు, వాటర్ వర్క్స్)	26,436
కేటగిరీ-5 (అగ్రికల్చర్)	2,00,448
మొత్తం సర్వీసులు	12,81,761

ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు మంగళం

ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ఇప్పటి వరకు 200 యూనిట్ల విద్యుత్ వినియోగానికి ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పలికినట్లు స్పష్టమవుతోంది. నవంబరు నెల వినియోగానికి సంబంధించి డిసెంబర్‌లో వచ్చిన బిల్లులు చూస్తే.. మినిమం యూనిట్ల వినియోగానికి కూడా కూడా చార్జీలు వచ్చాయి. వీరికి ఇచ్చే ఉచిత విద్యుత్‌ను ఎగనామం పెట్టేందుకు ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని తెరపైకి తెచ్చారు. ప్రతి కుటుంబం సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలని బలవంతంగా వారితో దరఖాస్తులు చేయిస్తున్నారు. లేదంటే బిల్లులు చెల్లించాల్సి వస్తుందని విద్యుత్ సిబ్బంది వారిపై ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

➡ దగదర్తి మండలం తడకలూరుకు చెందిన కూలి పనులు చేసుకునే ఒక పేదంటికి రెండు నెలల క్రితం వరకు 100 యూనిట్ల విద్యుత్ వినియోగానికి అన్ని చార్జీలు కలుపుకుని రూ.270 వస్తే.. ఈ నెలలో అవే యూనిట్లకు రూ.438 బిల్లు వచ్చింది. తనకు వచ్చే కూలి డబ్బులతో కుటుంబాన్ని పోషించుకోవడమే కష్టంగా ఉందని విచారిస్తున్న ఆ కుటుంబ డిసెంబర్ బిల్లు చూసి గొల్లుమంటున్నారు.

➡ విడవలూరు దళితవాడకు చెందిన గోళ్ల మల్లికార్జున కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఫ్రీ బిల్లు వస్తోంది. అయితే నవంబర్ నెలలో ఆ కుటుంబం 40 యూనిట్లు మాత్రమే కరెంట్ వినియోగించింది. కానీ ఆ కుటుంబానికి రూ.721 బిల్లు వచ్చింది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ఉచితంగా ఇచ్చే కరెంట్‌ను కూటమి ప్రభుత్వం నవంబర్ నుంచి మంగళం పలికిందని బాధిత కుటుంబం వాపోతోంది.



40 యూనిట్ల వినియోగానికి వచ్చిన రూ. 721 బిల్లు

➡ పొదలకూరు మండలం చెర్లోపల్లికి చెందిన సామాన్య రైతు ఎం.సుధాకర్‌రెడ్డి. ఆయన గృహ విద్యుత్ వినియోగం పరిశీలిస్తే విచిత్రంగా ఉంది.



నవంబరు, డిసెంబరు బిల్లులు

అక్టోబరులో వినియోగించిన 172 యూనిట్ల విద్యుత్ వినియోగానికి రూ.882 బిల్లు అందజేశారు. నవంబరులో 159 యూనిట్లే వినియోగించినా.. రూ.896 బిల్లు వచ్చింది. విద్యుత్ వినియోగం తగ్గితే బిల్లు కూడా తగ్గాలి. కానీ సుధాకర్‌రెడ్డికి బిల్లు పెరిగింది.

యూనిట్లు తగ్గినా.. బిల్లు బాదుడు



రావమ్మ ఇంటి వచ్చిన రెండు నెలల కరెంట్ బిల్లులు

అనంతసాగరం గ్రామానికి చెందిన రావమ్మ ఇంటికి విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లు బాదుడు తప్పలేదు. ఆమె అక్టోబరు నెలలో 72 యూనిట్ల విద్యుత్ వినియోగించింది. ఇందుకు సంబంధించి రూ.282 బిల్లు వచ్చింది. నవంబరులో ఆమె 62 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించింది. అయితే బిల్లు మాత్రం రూ.320 వచ్చింది. అక్టోబర్, నవంబర్ నెలల బిల్లులు పరిశీలిస్తే.. నవంబర్ నుంచి యూనిట్‌పై రూ.1.25 వంతున పెరిగింది.

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపాడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పోరుబాట నిర్వహించాలని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డీఈలు, ఈఈ కార్యాలయాలు, సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు, ర్యాలీలు, డిమాండ్ పత్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

షాక్ కొట్టేలా విద్యుత్ బిల్లులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.వేల కోట్లు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోంది. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచమని, అవసరమైతే ఉన్న చార్జీలు తగ్గిస్తామని చంద్రబాబు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పి రూ.15,485 కోట్లు విద్యుత్ చార్జీల పేరుతో పెంచి రాష్ట్ర ప్రజలను మోసం చేశారు.

– మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

చంద్రబాబు ఓ మోసకారి



చంద్రబాబు ఓ మోసకారి. గత ఎన్నికల సమయంలో ఒక్క రూపాయి కరెంట్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చాక రూ. వేల కోట్లు చార్జీలు పెంచాడు. గతంలో ఆయన చెప్పిన హామీలు ఏ ఒక్కటీ పూర్తి చేయలేదు. విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ సంస్థను అదానీకు కట్టబెట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. విద్యుత్ చార్జీల పెంపుతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.

– ఎస్‌కే మస్తాన్‌బీ, ఐద్వా జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం నేడు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు నగరంలోని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఆప్కే నిఖత్ 2.0 కార్యక్రమాన్ని ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్లా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.సురేష్‌కుమార్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న పింఛన్ల పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్లు ఈనెల 31వ తేదీన పంపిణీ చేసే లా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమా రి ఎంపీడీఓలను ఆదేశించారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ఆమె ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 3,09,271 మంది లబ్ధిదారులకు రూ.130 కోట్లు నగదు పంపిణీ చేయనున్నామన్నారు. 31వ తేదీ ఉదయం 6 గంటల నుంచి నగదు పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. 768 సచివాలయాల పరిధిని 13,181 క్లస్టర్లుగా విభజించి నగదు పంపిణీ చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ భర్త మరణించిన భార్యకు సకాలంలో దరఖాస్తులు అందజేసి మరుసటి నెల నుంచే పింఛన్ అందజేయాలన్నారు. గత నెలలో పింఛన్ తీసుకోని లబ్ధిదారులకు రెండు నెలల నగదును అందజేస్తామన్నారు. వరుసగా రెండు నెలలు తీసుకోకపోయినా మూడు నెలలకు కలిపి నగదును ఒకే పర్యాయం అందజేస్తామని పేర్కొన్నారు.

సెలవుపై కలెక్టర్

నెల్లూరు(అర్బన్): కలెక్టర్ ఆనంద్ మూడు రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ కార్తీక్‌కు బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ తిరిగి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరవుతారు.

జోజికి డాక్టరేట్ ప్రదానం



నెల్లూరు (టౌన్): డీకే డబ్ల్యూ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కమతం జోజికి డాక్టరేట్ లభించింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ టీవీ మురళీధర్ పర్యవేక్షణలో 'ది లీడర్ షిప్ రోల్స్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు సంబంధించి ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి



పార్వతయ్య మృతదేహం

ముత్తుకూరు: వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు పడవలో నుంచి జారిపడి మృతి చెందిన ఘటన కృష్ణపట్నంపోర్టులో బుధవారం రాత్రి జరిగింది. కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం.. బోగోలు మండలం పాత బంగారుపాళెంకు చెందిన ప్రళయకావేరి పార్వతయ్య (56) మరో ఏడుగురితో కలిసి చేపల వేటకు పడవలో సముద్రంలోకి వెళ్లాడు. తుపాను హెచ్చరిక రావడంతో మంగళవారం పోర్టు సమీపానికి చేరారు. బుధవారం రాత్రి భోజనం చేసి, పడవలో నిద్రపోయాడు. ఉదయం నీటిలో శవమై తేలాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెల్లడించారు.

వైద్యశాఖలో డిప్యుటేషన్లు రద్దు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాళన మొదలైంది. నూతన డీఎంహెచ్‌ఓగా సుజాత బాధ్యతలు చేపట్టిన రెండో రోజే తన మార్కును చూపించారు. గురువారం రాత్రి పలువురు డాక్టర్లను, వైద్య ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా 9 మంది డాక్టర్లకు స్థాన చలనం కలిగింది. హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ ఎడ్యుకేటర్, ఆఫీసు సబార్డినేటర్, ఫార్మసీ ఆఫీసర్, ఎఫ్ఎన్ఓ ఇలా మరో 15 మంది డిప్యుటేషన్లు రద్దు చేశారు. వారందరిని తక్షణమే కేటాయించబడిన స్థానాల్లో జాయిన్ కావాలని ఆదేశించారు.

తప్పుడు పత్రాలతో జైలుకు పంపారు

- ఆధారాలు లేవని రిమాండ్‌ను తిరస్కరించిన న్యాయమూర్తి
- సీఐ సుబ్బారావు, ఆర్ఐ రవి తప్పుడు ఆధారాలు సృష్టించారు
- ఆ అధికారులను వదిలే ప్రసక్తే లేదు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి వైఎస్సార్‌సీపీ బీసీ నేత, మాజీ జెడ్పీటీసీ మందల వెంకటశేషయ్యను జైలు పాల్జేశారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా జైల్లో ఉన్న వెంకటశేషయ్యను గురువారం కాకాణి ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓ మహిళను అడ్డు పెట్టుకుని తప్పుడు కేసులు బనాయించడం సిగ్గు చేటన్నారు. శేషయ్యను అరెస్ట్ చేశాక తొలి రోజు మేజిస్ట్రేట్ దగ్గర హాజరు పరిస్తే ఆధారాలు లేవని వెనక్కి పంపితే, తప్పుడు పత్రాలు సృష్టించి రెండో రోజు జైలుకు పంపారన్నారు. వెంకటాచలంలోని ఆ మహిళ అత్తమామలు వెంకటమ్మ, పెంచలయ్య నివాసంలో ఆమె కోడలు చేత ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు చేసినవి ఉన్నట్లుగా శేషయ్య తెలిపితే సీఐ సుబ్బారావు వెళ్లి ఆ స్టాంప్ పేపర్లు అడిగితే వారు ఇచ్చినట్లుగా క్రియేట్ చేశారన్నారు. ఆ తప్పుడు పంచనామాను ఆర్ఐ రవికుమార్ ఆ ప్రదేశానికి వెళ్లకుండానే వెళ్లినట్లుగా చూపి ధ్రువీకరించి కోర్టుకు సమర్పించి శేషయ్యను దుర్మార్గంగా జైలుకు పంపారని మండి పడ్డారు. ఆ రోజు వెంకటమ్మ, పెంచలయ్య వెంకటాచలంలో లేరని, ఆర్ఐ రవికుమార్ వెంకటాచలం రాకుండానే ఎక్కడో ఉండి దొడ్డిదారిలో సంతకాలు పెట్టించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్పీ సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపితే తాను చెప్పేది అవాస్తవమని తేలితే ఏ శిక్షకైనా తాను సిద్ధమని స్పష్టం చేశారు. మందల వెంకటశేషయ్య అంచెలంచెలుగా ఎదుగుతుండడంతో సోమిరెడ్డి జీర్ణించుకోలేక మహిళతో కలిసి తప్పుడు కేసు బనాయించి జైలుకు పంపాడని మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు బనాయించడం సిగ్గుమాలిన చర్య అని ధ్వజమెత్తారు. వెంకటశేషయ్యపై అక్రమ అరెస్ట్ చేసి జైలుకు పంపిన వారిని ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

భయపడేది లేదు

జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలను జైలుకు పంపినా భయపడే ప్రసక్తే లేదని కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. అన్యాయంగా కేసులు నమోదు చేసినా, పోలీసులు సివిల్ కేసుల్లో జోక్యం చేసుకుని ఇబ్బంది పెట్టినా పోలీస్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. జైల్ భరోకైనా తాము సిద్ధంగా ఉంటామని చెప్పారు. వెంకట శేషయ్యపై మోపిన అక్రమ కేసు పై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు కొణిదెన విజయ భాస్కర్‌నాయుడు, చీకుర్తి నరసయ్య పాల్గొన్నారు.

అన్యాయంగా జైలుకు పంపారు

- ఫిర్యాదురాలి అత్తమామలు

వెంకటాచలం: మాజీ జెడ్పీటీసీ మందల వెంకటశేషయ్యపై మా కోడలి చేత తప్పుడు కేసు నమోదు చేయించి ఆయన్ను అన్యాయంగా జైలుకు పంపారని వెంకటాచలం గ్రామానికి చెందిన వెంకటమ్మ, పెంచలయ్య దంపతులు చెప్పారు. మండలంలోని చెముడుగుంటలోని జిల్లా జైలు వద్ద గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబంలో ఆర్థిక లావాదేవీల గురించి వెంకటశేషయ్యకు చెప్పుకున్నామన్నారు. మాకు ఇవ్వకుండా తప్పించుకోవడం కోసమే మా కోడలు ఆయనపై ఈ కేసు పెట్టిందని విచారం వ్యక్తం చేశారు. సీఐ సుబ్బారావు మా ఇంటికి వచ్చినప్పుడు తాము ఆస్పత్రిలో ఉన్నామని, సీఐకు తాము డాక్యుమెంట్లు ఇచ్చినట్లు ఆర్ఐ రవికుమార్ దానిని ధ్రువీకరిస్తూ సంతకం పెట్టడం దుర్మార్గమని చెప్పారు. వెంకటశేషయ్యను అన్యాయంగా జైలుపాలు చేయడం కోసమే తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి దొంగ సంతకాలు పెట్టించారని ఆరోపించారు. జిల్లా అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

జికా వైరస్ కేసుల్లేవు

- 22 మందికి నెగటివ్
- డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్)/మర్రిపాడు: జిల్లాలో జికా వైరస్ కేసులు లేవని డీఎంహెచ్‌ఓ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మర్రిపాడు మండలం వెంకటాపురంలో తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఐదేళ్ల బాలుడు సుబ్బరాయుడికి జికా వైరస్ సోకినట్టు ప్రైవేట్ ల్యాబ్‌లో నిర్ధారణ కావడంతో వైద్యశాఖ అధికారులు ఆ గ్రామంలో బాలుడితో సహా 22 మందికి రక్తనమూనాలు సేకరించారు. వాటిని ఈ నెల 19న పూణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. వాటి ఫలితాలు రావడంతో డీఎంహెచ్‌ఓ సుజాత అందుకు సంబంధించిన వివరాలను వివరించారు. వెంకటాపురంలోని బద్దల సుబ్బరాయుడు అనే బాలుడి రక్తనమూనాలను ఈ నెల 14న నారాయణ ఆస్పత్రి నుంచి ముంబయిలోని ఓజిలస్ అనే ప్రైవేట్ ల్యాబ్‌కు పంపగా ఈ నెల 16న జికా వైరస్ సోకినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. దీంతో తమ శాఖ వెంటనే అప్రమత్తమై బాలుడిని చెన్నైలోని బేబీ ఆస్పత్రికి తరలించామన్నారు. అక్కడి ప్రభుత్వ సహకారంతో ఆ బిడ్డతో పాటు తల్లిదండ్రులు నాగరాజు, కళ్యాణి, గ్రామంలోని మరికొంత మందికి కలిపి మొత్తం 22 రక్తనమూనాలు మహారాష్ట్రలోని పూణే ల్యాబ్‌కు పంపించామన్నారు. అక్కడి పరీక్షల్లో అందరికీ నెగటివ్ (జికా వైరస్ లేదని) వచ్చిందని పూణే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ఎన్ఐవీ సంస్థ వెల్లడించిందన్నారు. చెన్నైలో చికిత్స పొందుతున్న బాలుని ఆరోగ్యం కూడా నిలకడగా ఉందన్నారు.

డీల్ కుదిరింది

- మైకా, పల్స్‌ఫర్‌ను యజమానులే విక్రయించుకోవచ్చు
- మైకా క్వార్ట్జ్, క్వార్ట్జ్ మాత్రం మైనింగ్ డాన్‌కే..
- నేడో.. రేపో అనుమతులు


క్వార్ట్జ్ ఖనిజం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గనుల వ్యవహారం కొలిక్కి వస్తోంది. మైనింగ్ డాన్, మైనింగ్ యజమానుల మధ్య డీల్ కుదిరినట్లు తెలిసింది. దీంతో పనులు చేసుకునేందుకు విడతల వారీగా అనుమతులు మంజూరవుతున్నాయి. ఇటీవలే ఆ డాన్ ఓకే చెప్పడంతో నాలుగు గనులకు అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అలాగే మంగళవారం 9 గనులకు అనుమతులు వచ్చాయి. అవి కూడా ఇద్దరికి చెందినవే కావడమే విశేషం. నేడు లేదా రేపు కొన్ని ఫ్యాక్టరీలతోపాటు గనులు కలిపి మొత్తం 10 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయనున్నట్టు సమాచారం. మైకా, పల్స్‌ఫర్‌ను గనుల యాజమానులే విక్రయించుకోవాలని, తమకు మాత్రం క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ ఇవ్వాలంటూ డాన్ హుకుం జారీచేసినట్లు తెలుస్తోంది. అందుకు మైనింగ్ యజమానులు కూడా ఒప్పుకున్నట్టు సమాచారం.

అవి ఆయనకే..

క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ ఖనిజంపై మైనింగ్ డాన్ కన్ను పడింది. కూటమి ప్రభుత్వంలోని పెద్దలు ఆయన చెప్పినట్లు వింటున్నారు. తాజాగా డాన్ విధించిన షరతులకు యజమానులు అంగీకరించినట్లు తెలిసింది. పల్స్‌ఫర్, మైకాను సంబంధిత యజమానులే అమ్ముకునేలా డీల్ కుదిరినా వాటిని కూడా డాన్‌కే ముట్టజెప్పే విధంగా పావులు కదిపినట్లు సమాచారం. గతంలో నోటీసులు లేకుండా, జరిమానాలు విధించకుండా ఉన్న గనులకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు అధికారికంగా తెలిసింది. కోర్టు వివాదం ఉన్నా కూడా ఓ గనికి అనుమతి ఇవ్వడం విశేషం.

రూ.105 కోట్ల నష్టం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో భూగర్భ గనులు ఏడు కాగా 140 మైకా, క్వార్ట్జ్ గనులతోపాటు గూడూరులో 75 సిలికా ఇసుక గనులున్నాయి. వీటిపై వివిధ పరిశ్రమలతో కలిపి మరో వందకుపైగా నడుస్తున్నాయి. ఈ యూనిట్లన్నీ ఇక్కడ లభించే ముడి ఖనిజంపై ఆధారపడ్డాయి. మైనింగ్ పరిశ్రమపై రాయల్టీ రూపంలోనే ప్రతి నెలా రూ.15 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. గడిచిన ఏడునెలలుగా నెలకు రూ.15 కోట్ల వంతున రూ.105 కోట్లు రాకుండా పోయింది. ఇప్పుడు మూసి ఉన్న గనులకు అనుమతులు మంజూరు చేస్తుండడంతో కార్మికులకు కొంత ఊరట లభిస్తుంది. మైనింగ్ నిబంధనలు పాటిస్తారో లేక డాన్ చెప్పిన విధంగానే వ్యవహరిస్తారో తెలియాల్సి ఉంది.

తిరగలేకున్నాం 'బాబూ..'

ప్రజా సమస్యల పరిష్కారానికి నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. జిల్లా కేంద్రం, మండలాల్లోని కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం పక్కాగా జరిగింది. చాలా సమస్యలపై అక్కడికక్కడే చర్యలు తీసుకునే వారు. పరిష్కరించే స్థితి లేనివాటిపై కలెక్టరేట్‌కు వెళ్లేవారు. కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు మారిపోయాయి. స్పందన పేరు మార్చింది. కానీ వినతులను ఆశించిన స్థాయిలో పట్టించుకోవడం లేదు. మండలాల్లోనే సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశిస్తున్నా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.


నెల్లూరులో వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు (ఫైల్)

- మండలాల్లో మొక్కుబడిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- జిల్లా కేంద్రానికి వస్తున్న జనం
- వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులు
- ప్రతి వారం వెల్లువలా వినతులు
- అందులో రెవెన్యూ శాఖవే అధికం
- కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని కొందరు మండలాధికారులు


ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు ఈశ్వరమ్మ. ఆత్మకూరు మండలంలోని రామస్వామిపల్లి వాసి. రెవెన్యూ సమస్య పరిష్కారం కోసం ఇటీవల నెల్లూరు నగరానికి వచ్చి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

మండలాల్లో ఇదీ పరిస్థితి


23వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక్కరే ఉన్న తహసీల్దార్ ప్రమీల

- జలదంకిలోని రెవెన్యూ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి వివిధ శాఖల సిబ్బంది డుమ్మా కొట్టారు. ఉదయం 11 గంటలకు తహసీల్దార్ ప్రమీల ఒక్కరే కనిపించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ, ఏపీఓ, ఏపీఎంలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు రాలేదు. వినతిపత్రాలు ఇవ్వాలని వెళ్లిన ప్రజలు నిరాశగా వెనుదిరిగారు.
- బుచ్చిరెడ్డిపాళెంలో 16వ తేదీన ఒక్క వినతిపత్రం మాత్రమే వచ్చింది. 23న తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలపై రెండు వినతులు మాత్రమే అందాయి. అవి కూడా రెవెన్యూ శాఖవే.

నెల్లూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. చిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రతి సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వందల సంఖ్యలో వినతిపత్రాలు వస్తున్నాయి. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్పందన కార్యక్రమం పక్కాగా జరిగింది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాలు, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో వినతులు స్వీకరించి చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

ఇప్పుడిలా..

ప్రజల బాధలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. సర్కారు పెద్దలు దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదని విమర్శలున్నాయి. మండలాల్లోనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్న చిన్న సమస్యలపై వినతులు జిల్లా కేంద్రానికి రాకుండా చూడాలన్నారు. కానీ కొందరు అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి సోమవారం ఒక్కో మండలంలో ఐదారు అర్జీలకు మించి రావడం లేదంటే మొక్కుబడిగా జరుపుతున్నారని అర్థమవుతోంది. చాలామంది కార్యక్రమానికి డుమ్మా కొడుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల నుంచి పెద్దగా స్పందన లేదని భావించిన జనం ప్రతి సోమవారం అష్టకష్టాలు పడుతూ నెల్లూరుకు చేరుకుని గంటల తరబడి ఎదురుచూసి వినతులు ఇస్తున్నారు. ఇందులో ఎక్కువగా రెవెన్యూ శాఖవే వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. వినతుల్లో ఆ తర్వాతి స్థానం మున్సిపల్ శాఖదే. పంచాయతీరాజ్‌వి కూడా ఎక్కువగానే ఉంటున్నాయి.

ఇటీవల శాఖల వారీగా చూస్తే..



- డిసెంబర్ 2న 212 వినతులందాయి. ఇందులో రెవెన్యూ శాఖవి 95, మున్సిపల్ శాఖవి 23, సర్వే శాఖవి 13, పంచాయతీ రాజ్ శాఖవి 11, సివిల్ సప్లయీస్‌వి 11, ఇరిగేషన్ శాఖవి 10, పోలీస్ శాఖవి 6, పంచాయతీరాజ్‌వి 5 తదితరాలున్నాయి.
- 9న 256 వినతులందాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 130, మున్సిపల్ శాఖకు 22, సర్వేకు 12, పంచాయతీరాజ్‌కు 17, సివిల్ సప్లయిస్ 7 వినతులు, మరికొన్ని అందుకున్నారు.
- 16న వివిధ శాఖలకు సంబంధించి 244 వినతిపత్రాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖవి 120, మున్సిపల్ శాఖవి 16, సర్వేవి 16, పంచాయతీరాజ్ శాఖవి 19, సివిల్ సప్లయీస్‌వి 12, ఇతర శాఖల వినతులొచ్చాయి.
- 23న 263 వినతులు రాగా అందులో రెవెన్యూ శాఖవి 127, మున్సిపల్ శాఖవి 21, సర్వేవి 12, పంచాయతీరాజ్ శాఖవి 16, సివిల్ సప్లయీస్‌వి 7 తదితర శాఖలవి ఉన్నాయి.

ఎన్నిసార్లు చెబుతున్నా..

మరోవైపు కలెక్టర్, ఉన్నతాధికారులు వినతులు పరిష్కరించాలని, పునరావృతం కాకూడదని పదేపదే సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు పెట్టి మండలాధికారులను ఆదేశిస్తున్నారు. కానీ వారు బేఖాతరు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. దీంతో పల్లెల్లో చిన్న, చిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. డ్రెయినేజీ, రోడ్ల సమస్యలను చెప్పేందుకు జిల్లా కేంద్రానికి జనం వస్తున్నారు. నవంబర్ నెలలో 4వ తేదీన అత్యధికంగా 399, 11న 350 వినతిపత్రాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చాయి. ఈ సర్కారు ఏదో ఒక కారణం చెప్పి ప్రతినెలా పింఛన్లను తీసేస్తోంది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు వ్యయప్రయాసలకోర్చి వస్తున్నారు. జిల్లా అధికారులు అప్పుడప్పుడు వేదిక కార్యక్రమానికి డుమ్మా కొట్టి కింది స్థాయి అధికారులను పంపుతున్నారని విమర్శలున్నాయి.

అవే అధికంగా..

మండలాల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంది. అందుకే చాలామంది జిల్లా కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. భూ వివాదాలు, హద్దులు, ఆక్రమణలు తదితరాలపైనే వినతులు అధికంగా ఉంటున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో హడావుడి చేస్తుంది. వాటిల్లో పదుల సంఖ్యలో కూడా అర్జీలు రావడం లేదు. వాటిపై చర్యలు తీసుకోవడం లేదని కలెక్టరేట్‌లో వస్తున్న వినతుల సంఖ్యను చూస్తే తెలుస్తోంది. దీంతో సదస్సులతో ఉపయోగం ఏముందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వంలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయి. దీనికి సంబంధించి అర్జీలు కూడా పెద్దఎత్తున వస్తున్నాయి.

కుమార్తె బాధ చూడలేక..

- వివాహితకు అత్తింటి వేధింపులు
- బలవన్మరణానికి పాల్పడిన ఆమె తండ్రి
- సీఎం, డిప్యూటీ సీఎంకు సూసైడ్ నోట్
- రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోలేదని ఆవేదన


శ్రీనివాసులు (ఫైల్)


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు రాసిన సూసైడ్ నోట్

కలిగిరి: ఓ తండ్రి కుమార్తెకు అట్టహాసంగా వివాహం చేశాడు.. కానీ పెళ్లయిన కొన్ని రోజులకే ఆమెకు అత్తింటి వారి వేధింపులు ఎక్కువయ్యాయి. తండ్రి పోలీసులను ఆశ్రయించినా రాజకీయ ఒత్తిళ్లు, ధన బలంతో వారు అతని ఆవేదనను పట్టించుకోలేదు. కళ్ల ముందు కుమార్తె పడుతున్న బాధను చూడలేకపోయాడు. ఆమెకు న్యాయం చేయలేకపోతున్నానని మనస్తాపంతో సొంత మండలానికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులు గురువారం వివరాలు వెల్లడించారు. కలిగిరి మండలంలోని తూర్పుదూబగుంట గ్రామానికి చెందిన బొట్టా శ్రీనివాసులు (52) ఉపాధి నిమిత్తం 30 సంవత్సరాల క్రితం భీమిలికి భార్య, కుమార్తె, కుమారుడితో వెళ్లాడు. ఇటుక బట్టీ వ్యాపారం చేస్తున్నాడు. కుమార్తె యమునకు అదే ప్రాంతానికి చెందిన సూర్యకుమారి రెండో కుమారుడు చంద్రశేఖర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించాడు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. కొన్నినెలలుగా యమునపై అత్తింటి వారి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో ఆమెను శ్రీనివాసులు ఇంటికి తీసుకొచ్చేశాడు. యమునను భర్త, అత్త, బావ తన ఇంటికొచ్చి కొట్టి మనుమడిని తీసుకుపోవడంతో శ్రీనివాసులు పోలీసులను ఆశ్రయించాడు. బాధ్యులపై పోలీసులు కేసు పెట్టలేదు. రాజీ చేసుకోవాలని చెప్పారు. ఇంటి వద్ద ఉన్న కుమార్తె బాధను చూడలేక శ్రీనివాసులు నాలుగు రోజుల క్రితం కలిగిరిలో ఉన్న తల్లిదండ్రులు, తమ్ముడు రమణయ్య ఇంటికొచ్చాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మృతుడి భార్య, కుమార్తె, కుమారుడు, బంధువులు భారీ సంఖ్యలో గురువారం భీమిలి నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని శ్రీనివాసులు ఆత్మహత్యకు పాల్పడేందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సై ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సూసైడ్ నోట్

యమునపై వేధింపులకు పాల్పడుతూ తాను ఆత్మహత్యకు పాల్పడానికి కారణమైన బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు అనిత, నారా లోకేశ్‌కు శ్రీనివాసులు సూసైడ్ నోట్ రాశాడు. తన కుమార్తెను అత్తింటి వారు ఎలా వేధించింది?, తాము ఎంత మానసికవేదనకు గురైంది తదితర కారణాలను ఐదుపేజీల్లో వివరించాడు. తాను కూడా టీడీపీ సభ్యుడినేనంటూ ఐడీ నంబర్‌తో సహా రాశాడు.

నాటుసారా స్వాధీనం

బిట్రగుంట: బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న కట్టా మనోహర్ అనే వ్యక్తిని కావలి ఎక్సైజ్ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి మనోహర్‌ను అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కావలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.


ప్రాణం తీసిన గుంతలు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శీనయ్య మృతదేహం

వెంకటాచలం: రోడ్డుపై గుంతల కారణంగా నిండు ప్రాణం పోయింది. ఈ ఘటన మండలంలోని తిక్కవరప్పాడు - గొలగమూడి గ్రామాల మధ్య గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కంటేపల్లి పడమర గిరిజన కాలనీకి చెందిన బాణాల శీనయ్య (40) అనే వ్యక్తి పని నిమిత్తం సర్వేపల్లికి స్కూటీపై వెళ్లాడు. తిరిగి కంటేపల్లికి వస్తుండగా దారిలో తిక్కవరప్పాడు - గొలగమూడి మధ్య రోడ్డుపై ఉన్న గుంతల్ని చూసి తప్పించబోయాడు. ఈ సమయంలో స్కూటీ అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో శీనయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందిండంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.29
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	113
లేయర్ (లైవ్) :	100
బ్రాయిలర్ చికెన్ :	208
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	228
లేయర్ చికెన్ :	170